


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం | 01-03-2023 | సంపుటి : 04 | సంచిక : 163 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## మనది పేదల ప్రభుత్వం, రైతన్న ప్రభుత్వం: సీఎం జగన్



తాడేపల్లి: రాష్ట్రంలో వరుసగా నాలుగో ఏడాది కూడా వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. ఈ ఏడాది మూడో విడతగా 51.12 లక్షల మందికి రూ.1,090.76 కోట్లను సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లోకి జమచేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. 'మీ ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. ఇవాళ్ల రైతులకు సంబంధించి రెండు మంచి కార్యక్రమాలు చేస్తున్నాము. 50 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. వరుసగా నాలుగో ఏడాది మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్నాం. తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా ఏటా రూ.13,500 భరోసా అందిస్తున్నాము. ఈ ఏడాది ఇప్పటికే రెండు విడతల్లో 50.92 లక్షల మందికి రూ.5,853.74 కోట్లు లబ్ధిచేకూరింది. మూడో విడత కింద 51.12 లక్షల మందికి రూ. 1.090.76 కోట్లు జమ చేస్తున్నాం. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి రూ.54వేల చొప్పున సాయం అందించాం. ఈ నాలుగేళ్ల కాలంలో రైతు భరోసా కింద రూ.27,062 కోట్లు సాయం అందజేశాము. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో పరిహారం అందిస్తున్నాము. మాండూస్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన 91,237 మంది రైతులకు రూ. 76,99 కోట్లు అందిస్తున్నాం. వ్యవసాయం బాగుంటేనే రైతులు బాగుంటారు. రైతుల బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయి. నాలుగేళ్ల కాలంలో ఎక్కడా కరువు అనే మాటే లేదు. 2014-19 మధ్య గత ప్రభుత్వంలో ఓ అన్యాయస్థుడు సీఎంగా ఉన్నాడు. చంద్రబాబు పాలనలో ప్రతీ ఏటా కరువే ఉంది. కరువుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు. మాజీ సీఎం హయంలో ఏటా కరువు మండలాల ప్రకటనే ఉండేది. నాలుగేళ్లుగా ప్రతి చెరువు, రిజర్వాయర్ నిండాయి. రాష్ట్రంలో నాలుగేళ్లుగా భూగర్భ జలాలు పెరిగాయి. నాలుగేళ్లుగా ఆహార ధాన్యాల దిగుబడి సగటున 166 లక్షల టన్నులకు పెరిగింది. నాలుగేళ్లుగా రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ జరిగింది. ధాన్యం సేకరణ కోసం ఇప్పటి వరకు రూ. 55వేల కోట్లకుపైగా ఖర్చు చేశాం. రైతు భరోసా ద్వారా రూ.27వేల కోట్లు అందజేశాం. పట్టా ఉన్న రైతులకే కాకుండా అసైన్డ్ భూముల రైతులు, కౌలు రైతులలకూ రైతు భరోసా అందించాము. ఆర్బీకేల ద్వారా



రైతన్నలకు విత్తనం నుంచి ఎరువుల వరకు తోడుగా నిలిచాం. మన ఆర్బీకేలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయి. టీడీపీ పాలనలో ఐదేళ్లలో 30.85 లక్షల మంది రైతులకు రూ. 3,411 కోట్లు మాత్ర?మే అందించారు. మన ప్రభుత్వంలో గడిచిన నాలుగేళ్లుగా రైతులకు రూ.6,685 కోట్ల సాయం అందించాం. రైతన్నకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలుస్తున్నాం. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను మేం తీర్చుతున్నాం. సున్నా వడ్డీ కింద ఇప్పటి వరకు రూ,1,834 కోట్లు చెల్లించాం?. వ్యవసాయం దండగా అన్న చంద్రబాబుకు మన ప్రభుత్వం మీద కడుపు మండుతోంది. కడుపు మంటకు, అసూయకు అసలే మందు లేదు. చంద్రబాబుది పెత్తందార్ల పార్టీ. మనది పేదల ప్రభుత్వం, రైతన్న ప్రభుత్వం' అని అన్నారు.

## సాంకేతికతతో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్: మోదీ

దిల్లీ: 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించేందుకు సాంకేతికత సాయపడనుందని ప్రధాని మోదీ అన్నారు. డిజిటల్ విప్లవం ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. బడ్జెట్ అనంతరం 'సాంకేతికతతో జీవనం' అనే అంశంపై నిర్వహించిన ఓ వెబినార్‌లో ఆయన మాట్లాడారు. చిన్న వ్యాపారులకు భారంగా ఉన్న నిబంధనలను తగ్గించాలని తాము కోరుకుంటున్నామని ప్రధాని మోదీ అన్నారు. ఈ తరహావి 40 వేల నిబంధనలను తొలగించామన్నారు. తమకు అడ్డుగా భావిస్తున్న నిబంధనలతో జాబితాను రూపొందించాలని చిన్న వ్యాపారులకు సూచించారు. పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న సమస్యను అధిగమించేందుకు ఫేస్‌లెస్ టెక్నాలజీని తీసుకొచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత పౌరుల జీవితాల్లో సమూల మార్పులకు సాంకేతికత ఉపయోగపడుతోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో 5జీ, కృత్రిమ మేధ వంటి సాంకేతికతలు మార్పులు తీసుకొస్తున్నాయని మోదీ అన్నారు. టెక్నాలజీ వల్లే 'వన్ నేషన్ వన్ రేషన్' కార్యక్రమం సాకరమైందని చెప్పారు. జన్‌ధన్ యోజన, ఆధార్, మొబైల్ నంబర్‌తో పేద ప్రజలకు ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. ఈ శతాబ్దం టెక్నాలజీతో ముడిపడి ఉందని, దీన్నెవరూ ఆపలేరని మోదీ అన్నారు.



## ధర్మపరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి కొట్టు సత్యనారాయణ

అమరావతి: సీజీఎఫ్ ద్వారా పెద్ద ఎత్తున దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో 1330 దేవాలయాల పనులు జరుగుతున్నాయని,



మరో 1465 దేవాలయాలను అదనంగా నిర్మిస్తున్నామన్నారు. ప్రతీ 25 దేవాలయాల పర్యవేక్షణకు ఒక ఏఈవో నియమిస్తామని, రూ. 270 కోట్ల రూపాయల సీజీఎఫ్ నిధులతో దేవాలయాల పనులను చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు."ధర్మ పరిరక్షణే మా ప్రభుత్వ ధ్యేయం. ధర్మం పరిరక్షింపబడాలంటే దేవాలయాలుండాలి. జనవరి 4 నాటికి 68 కోట్ల రూపాయల పనులు పూర్తయ్యాయి. నూతనంగా నిర్మించే ప్రతీ ఆలయంలో ధూపదీప నైవేద్యాలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. ధూపదీప నైవేద్యాలు చేసే అర్చకులకు 5 వేలు ఇస్తాం. శ్రీశైలంలో అన్నదాన సత్రానికి భూమిలిచ్చే విషయం పై పాలసీమ్యాటర్‌ను పరిశీలిస్తున్నామని మంత్రి అన్నారు.''లోకేష్ పాదయాత్రను పిచ్చోడి పాదయాత్రగా మంత్రి అభివర్ణించారు. లోకేష్ పాదయాత్రలో ఏదిపడితే అది మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. "నేను అధికారంలోకి రాగానే అందరి అంతూ తేల్చేస్తానంటున్నాడు. పాదయాత్రతోనే ముఖ్యమంత్రిని అయిపోయాననే భ్రమలో లోకేష్ ఉన్నాడు. తండ్రీ, కొడుకులు చేసే పనులు ప్రజలపై కక్ష తీర్చుకునేలా ఉన్నాయి. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ప్రజలకు ఏం చేశాడు?. తన సభల్లో చంద్రబాబు చాలా నీచంగా మాట్లాడుతున్నాడు. ఎందుకు టన్నులు టన్నులు మా పై విషం కక్కుతున్నారు" అంటూ మంత్రి ప్రశ్నించారు."భగవంతుడికి అపకారం చేశారు కాబట్టే చంద్రబాబు, లోకేష్‌లకు శిక్షపడింది. దేవాలయాల భూములు కాజేసిందెవరో.. అమ్మేసిందెవరో అందరికీ తెలుసు. తన తండ్రి చేసిన పనులు గుర్తుకొచ్చి.. లోకేష్ మాపై ఆరోపణలు చేస్తున్నాడు. విజయనగరం భూముల వ్యవహారం రెండు నెలల క్రితమే మా దృష్టికి వచ్చింది. ఉద్యోగులను.. ఈవోను సస్పెండ్ చేశాం. ఎంక్వైరీకి ఆదేశించాం.. రిపోర్టు రాగానే బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి అన్నారు.

## హైకోర్టుకు వెళ్లండి.. సిసోదియాకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టైన దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియాకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సీబీఐ అరెస్టు విషయంలో జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. సీబీఐ అరెస్టు వ్యవహారాన్ని సవాల్ చేయాలనుకుంటే హైకోర్టుకు వెళ్లవచ్చని సిసోదియాకు సూచించింది. సీబీఐ ఛార్జిషీటులో సిసోదియా పేరు లేకున్నా ఆయన్ను అరెస్టు చేయడం అక్రమమని సిసోదియా తరఫున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా



దర్యాప్తునకు సహకరించడం లేదని సీబీఐ చేస్తోన్న ఆరోపణలు కూడా బలహీనమైన సాకుగా పేర్కొన్నారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. సీబీఐ అరెస్టును సవాల్ చేయాలనుకుంటే హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

## తాడేపల్లి నుంచి తెనాలికి హెలికాప్టరా... జనం నవ్వుకుంటున్నారు జగన్: నాదెండ్ల

అమరావతి: అధికార పార్టీ నాయకులకు, అధికారులకు ఎందుకంత అభద్రతా భావమని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. సీఎం జగన్ తెనాలి పర్యటనకు వస్తుంటే జనసేన పార్టీ నాయకులను అరెస్టు చేయడం



అప్రజాస్వామికమన్నారు. సీఎం వస్తే ప్రతిపక్ష పార్టీ నాయకులను అరెస్టు చేయాలని ఏ చట్టం చెబుతోందని ఆయన నిలదీశారు. ప్రజలన్నా, ప్రశ్నించే ప్రతిపక్షాలన్నా సీఎంకు భయమని.. అందుకే ఆయన తెనాలి పర్యటనకు వస్తుంటే ఇవాళ అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం సృష్టించారన్నారు. మరోవైపు తాడేపల్లి నుంచి తెనాలికి జగన్ హెలికాప్టర్‌లో వెళ్లడాన్ని మనోహర్ తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు."రోడ్డు మీద వెళ్తే గుంతలు.. పాడైపోయిన రోడ్లు ఉంటాయని సీఎం హెలికాప్టర్‌లో వెళ్తున్నారా? జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి తెనాలికి 28కి.మీ మాత్రమే ఉంటుంది. ఈ మాత్రం దూరం కూడా రోడ్డు ప్రయాణం చేయలేరా? అంత తక్కువ దూరానికి హెలికాప్టర్‌లో వెళ్లడం ఏంటి? జనం నవ్వుకుంటున్నారు. జనం సొమ్ము సీఎం హెలికాప్టర్ల పర్యటనల పాలవుతోంది. హెలికాప్టర్‌కు పెట్టే డబ్బులతో రోడ్లు బాగవుతాయి. ప్రజల్ని గతుకు రోడ్ల పాల్జేసి.. జగన్ హెలికాప్టర్‌లో తిరుగుతున్నారు" అని నాదెండ్ల విమర్శించారు.

## అసెంబ్లీ సమావేశాల్లో రాజధాని బిల్లు

విజయవాడ, ఫిబ్రవరి 28, ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే సమావేశాలను మార్చి 14వ తేదీ నుంచి ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. అదేరోజు ఉభయసభలను ఉద్దేశించింగి గవర్నర్ ప్రసంగం ఉండనుంది. ఇక కీలకమైన బడ్జెట్ ను మార్చి 17వ తేదీన ప్రవేశపెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మార్చి 15వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చించడంతో పాటు సీఎం కూడా మాట్లాడే అకాశం ఉంది. అయితే ఆయా తేదీలపై ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. నిజానికి ఎమ్మెల్సీ ఎన్నికల పూర్తి అయిన తర్వాత అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ఏపీ సర్కార్ యోచించింది. ఎన్నికలతో సంబంధం లేకుండా... సభను నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా మార్చి 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జీ-20 సదస్సులు జరగనున్నాయి. వీటికంటే ముందే శాసనసభ సమావేశాలను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అంటే 27వ తేదీలోపే ముగిసే అవకాశం ఉంటుంది. ఈ సమావేశాలు అత్యంత ఆసక్తిని రేపుతున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. తాను విశాఖకు షిఫ్ట్ అయిపోతానని.. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన ఉంటుందని సీఎం జగన్ కొద్దిరోజుల కిందట ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ వేదికగా జగన్... కీలక ప్రకటన చేసే అవకాశం ఉందన్న చర్చ జోరుగా జరుగుతోంది. మరోవైపు 3 రాజధానుల అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నందున ఆ పరిణామాల ఆధారంగా ముఖ్యమంత్రి ప్రకటన ఉండే ఛాన్స్ కూడా ఉంటుంది. ఇక వచ్చే నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎమ్మెల్యేలు, మంత్రులు అభ్యర్థుల గెలుపుపైనే పనిచేయాలని ముఖ్యమంత్రి జగన్ స్పష్టంగా ఆదేశించారు. వీరి గెలుపుతో మండలిలో వైసీపీ బలంగా భారీగా పెరగనుంది. మరోవైపు రాజధాని వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ వ్యవహారంపై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేశారు. దానిపై విచారణ జరుగుతోంది. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో ఊరట దక్కుతుందని ఏపీ ప్రభుత్వం గంపెడాశలతో ఉంది. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తే చట్టబద్ధంగా విశాఖ వెళ్లాలనే ఆలోచన కూడా ప్రభుత్వంలో లేకపోలేదు. విమర్శలకు తావు లేకుండా న్యాయస్థానం అనుమతితోనే విశాఖ వెళుతున్నట్లు ప్రచారం చేసుకోవచ్చు. అదే సమయంలో శాసనసభతో పాటు, మండలిలో ప్రభుత్వం అనుకున్న బిల్లులను ప్రవేశపెట్టి నెగ్గించుకునే అవకాశం కూడా ఉంది.

## ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు ప్రపంచానికి చెబుతాం: మంత్రి అమర్నాథ్

విశాఖపట్నం: ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చెబుతామని మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. 14 రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి ఎంవోయూలు జరుగుతాయని అన్నారు. రెండు రోజుల పాటు ఏంఓయూలు నిర్వహిస్తామన్నారు. 25 దేశాలకు చెందిన ప్రతినిధులు వస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 14 సెక్టార్లను ఎంపిక చేసుకున్నట్లు చెప్పారు. ఐటీ, అగ్రికల్చర్, హెల్త్, ఫార్మా, టూరిజం సహా పలు రంగాలను పెట్టుబడులకు ఉన్న అవకాశాలు వివరిస్తామని వెల్లడించారు. ఈ మేరకు మంత్రి అమర్‌నాథ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. మార్చి 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ్మిట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. పరిశ్రమలకు సంబంధించిన ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. కొత్త ఇండస్ట్రీయల్ పాలసీని(2023-2028) అమలులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద సముద్ర తీరం కలిగిన రాష్ట్రంగా ఏపీ ఉందని పేర్కొన్నారు. పోర్టుల అభివృద్ధికి సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లుగా నెంబర్ వన్‌లో ఉన్నామన్నారు.'రాష్ట్రంలో ఈ ప్రభుత్వం మొట్టమొదటి సారిగా గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ నిర్వహిస్తుంది. రాష్ట్రంలో ఉన్న వనరులు, మౌలిక వసతులు, సదుపాయాలు సమ్మిట్‌లో వివరిస్తాం. 8 శాతం ఎగుమతులు దేశంలో ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఎస్‌డీజీలో 4 వ స్థానంలో ఉంది మన రాష్ట్రం. దేశంలోని 11 ఇండస్ట్రీయల్ కారిడర్లలో 3 ఏపీలోనే ఉన్నాయి. 48 వేల ఎకరాల భూమి కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. పెద్ద పెట్రోలియం కంపెనీలను వచ్చేలా చేస్తాం. ఏపీ మారిటైం బోర్డ్ ద్వారా 15 వేల కోట్లతో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తున్నాం. 10 పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్లతో రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుంది. ప్రతి పోర్టుకి అనుబంధంగా పోర్టు ఆధారిత పరిశ్రమల అభివృద్ధి చేస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్‌లో కొబ్బరి ఎగుమతుల్లో ఏపీ నెంబర్ 1గా ఉంది. బొప్పాయి, టామోటో, మామిడి సబంధిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై దృష్టి పెట్టాం. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే టెక్స్‌టైల్ రంగంపై దృష్టి పెట్టాం. ఎనర్జీ రంగంలో రేనువాబుల్ ఎనర్జీలో పెట్టుబడులపై ఫోకస్ చేస్తున్నాం. మేజర్ పరిశ్రమలు ఈ రంగంలో తేవాలని అనుకుంటున్నాం' అని మంత్రి అమర్నాథ్ తెలిపారు.

## టీడీపీ నేత నారాయణకు ఏపీ సీఐడీ నోటీసులు

అమరావతి: రాజధాని భూముల కేసులో టీడీపీ నేత నారాయణకు ఏపీ సీఐడీ నోటీసులు జారీ చేసింది. 41ఏ సీఆర్పీసీ కింద సీఐడీ నోటీసులు ఇచ్చింది. మార్చి 6న విచారణకు రావాలని సీఐడీ నోటీసుల్లో పేర్కొంది. నారాయణతో పాటు ఉద్యోగి ప్రమీల, రామకృష్ణ హౌసింగ్ ఎండీ అంజనీకుమార్, నారాయణ కుమార్తెలు సింధూర, శరణి, అల్లుళ్లు



పునీత్, వరుణ్‌కు సీఐడీ నోటీసులు జారీ చేసింది. నారాయణ కుమార్తెలు మార్చి 7న విచారణకు రావాలని సీఐడీ నోటీసులు ఇచ్చింది. కాగా, రాజధాని ముసుగులో టీడీపీ పెద్దలు రూ.వెయ్యి కోట్లకుపైగా నల్లధనాన్ని మళ్లించి 169.27 ఎకరాల అసైన్డ్ భూములను సిబ్బంది, పని మనుషుల పేరుతో కాజేసిన బాగోతం బట్టబయలైంది. అమరావతిలో చంద్రబాబు సర్కారు అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు ఈ కేసులో కీలక పురోగతి సాధించారు. టీడీపీ హయాంలో మొత్తం రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నట్లు ఇప్పటికే గుర్తించగా నల్లధనాన్ని మళ్లించేందుకు 'ఎన్‌స్పైర' అనే షెల్ కంపెనీని వాడుకున్నట్లు తేలింది.

# సంపాదకీయం

బుధవారం 01-03-2023

## మద్యం పాలసీ కథేంటీ....

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను సీబీఐ అరెస్ట్ చేసింది. ఇంతకు ముందు కూడా సిసోడియాను సీబీఐ పలుమార్లు ప్రశ్నించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ అంశంపై ట్వీట్ చేసి కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. డిప్యూటీ సీఎం అరెస్ట్ తర్వాత మరోసారి మద్యం స్కామ్‌పై చర్చ మొదలైంది.కొత్త మద్యం పాలసీ వల్ల ఎవరికి నష్టం ఎవరికి లాభం అనేది చర్చ జరుగుతున్నది. 17 నవంబర్ 2021న ఢిల్లీ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని అమలులోకి తెచ్చింది.రాజధానిలో 32 జోన్లు సృష్టించగా ఒక్కో జోన్‌లో గరిష్టంగా 27 షాపులు తెరవాల్సి ఉంది. ఈ విధంగా మొత్తం 849 దుకాణాలు తెరవాల్సి ఉంది. కొత్త మద్యం పాలసీలో ఢిల్లీలోని అన్ని మద్యం దుకాణాలను ప్రైవేట్ వారికి ఇచ్చేశారు. గతంలో ఢిల్లీలోని 60 శాతం మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, 40 శాతం ప్రైవేట్‌గా ఉండేవి. కొత్త విధానం అమలులోకి వచ్చిన తర్వాత 100 శాతం ప్రైవేట్‌గా మారింది. ప్రభుత్వానికి రూ. 3,500 కోట్లు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం వాదించింది. ప్రభుత్వం లైసెన్స్ ఫీజును కూడా అనేక రెట్లు పెంచింది. గతంలో కాంట్రాక్టర్లు 25 లక్షలు చెల్లించాల్సిన ఎల్-1 లైసెన్స్, కొత్త మద్యం పాలసీ అమలు తర్వాత కాంట్రాక్టర్లు రూ.5 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. అదేవిధంగా, ఇతర కేటగిరీలలో కూడా లైసెన్స్ ఫీజులో గణనీయమైన పెరుగుదల ఉంది.కొత్త మద్యం పాలసీ వల్ల ప్రజలకు, ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని ప్రత్యర్థులు ఆరోపించారు. అదే సమయంలో బడా మద్యం వ్యాపారులకు లబ్ధి చేకూరుతుందని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ భారతీయ జనతా పార్టీ ఆరోపణలు. ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారం మూడు రకాలుగా చూడవచ్చు. దీన్ని అర్థం చేసుకోవడానికి, కొన్ని గణాంకాలను చూద్దాం.కాంట్రాక్టర్లు మద్యం విక్రయాలకు లైసెన్స్ తీసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వం లైసెన్స్ ఫీజును నిర్ణయించింది. దీనికోసం ప్రభుత్వం అనేక క్యాటగిరీలను సృష్టించింది. దీని కింద మద్యం, బీరు, విదేశీ మద్యం తదితరాలను విక్రయించేందుకు లైసెన్స్ ఇస్తారు. ఉదాహరణకు, గతంలో కాంట్రాక్టర్ రూ.25 లక్షలు చెల్లించాల్సిన లైసెన్సు కోసం, కొత్త మద్యం పాలసీ అమలులోకి వచ్చిన తర్వాత, దానికి రూ.5 కోట్లు చెల్లించాల్సి వచ్చింది.బడా మద్యం వ్యాపారులకు లబ్ధి చేకూర్చేందుకే ఢిల్లీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా లైసెన్స్ ఫీజును పెంచిందని ఆరోపించారు. దీంతో చిన్న కాంట్రాక్టర్ల దుకాణాలు మూతపడి బడా మద్యం మాఫియాకు మాత్రమే మార్కెట్‌లో లైసెన్సులు లభించాయి. దీనికి బదులు లిక్కర్ మాఫియా ఆప్ నాయకులకు, అధికారులకు భారీ మొత్తంలో లంచం ఇచ్చిందనేది కూడా విపక్షాల ఆరోపణ.అయితే ఇది లాభదాయకమైన ఒప్పందం అని ఢిల్లీ ప్రభుత్వం చెబుతోంది. లైసెన్స్ ఫీజును పెంచడం ద్వారా ప్రభుత్వానికి ఒకేసారి ఆదాయం వచ్చిందని ప్రభుత్వం వాదిస్తోంది. ఎక్సైజ్ సుంకం, వ్యాట్ తగ్గించిన లోటును ఇది భర్తీ చేసిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.రెండో ఆరోపణ మద్యం విక్రయాలకు సంబంధించినది. ఉదాహరణకు, ఇంతకు ముందు 750 మి.లీ మద్యం బాటిల్ రూ.530కి లభిస్తుందనుకుందాం. అప్పుడు ఈ ఒక్క బాటిల్‌పై రిటైల్ వ్యాపారి రూ.33.35 లాభాన్ని పొందగా, ప్రభుత్వానికి ఎక్సైజ్ పన్నుగా రూ.223.89, వ్యాట్ కింద రూ.106 వచ్చింది. అంటే ఒక సీసాపై ప్రభుత్వానికి రూ.329.89 లాభం వచ్చేది. కొత్త మద్యం పాలసీతో ప్రభుత్వం ఈ లాభంలో పెద్ద ఎత్తున వాటా కోల్పోతున్నదనే ఆరోపణ ఉంది. కొత్త మద్యం పాలసీలో అదే 750 ఎంఎల్ మద్యం బాటిల్ ధర రూ.530 నుంచి రూ.560కి పెరిగింది.రిటైల్ వ్యాపారి లాభం కూడా రూ.33.35 నుంచి నేరుగా రూ.363.27కి పెరిగింది. అంటే రిటైల్ వ్యాపారుల లాభం 10 రెట్లు పెరిగింది. అదే సమయంలో ప్రభుత్వానికి రూ.329.89 ప్రయోజనం రూ.3.78కి తగ్గింది. ఇందులో ఎక్సైజ్ డ్యూటీ రూ.1.88, వ్యాట్ రూ.1.90 ఉన్నాయి. మద్యం కుంభకోణం వెలుగు చూసినప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా విచారణ జరిపించింది. చీఫ్ సెక్రటరీ విచారణ జరిపి నివేదిక తయారు చేసి రెండు నెలల క్రితమే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు పంపారు. ఈ నివేదికలో ఏడు అంశాలను కూడా ప్రశ్నించారు.మనీష్ సిసోడియా సూచనల మేరకు ఎక్సైజ్ శాఖ ఎయిర్‌పోర్ట్ జోన్‌కు చెందిన ఎల్-1 బిడ్డర్‌కు రూ.30 కోట్లను తిరిగి ఇచ్చింది. బిడ్డర్ విమానాశ్రయ అధికారుల నుండి అవసరమైన ఎన్‌ఓసి పొందలేకపోయాడు. అటువంటి పరిస్థితిలో, అతను డిపాజిట్ చేసిన సెక్యూరిటీ డిపాజిట్ ప్రభుత్వ ఖాతాలో జమ చేయబడాలి. అయితే ప్రభుత్వం ఆ డబ్బును బిడ్డర్‌కు తిరిగి ఇచ్చింది.ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నవంబర్ 8, 2021న కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి లేకుండానే ఆర్డర్ జారీ చేయడం ద్వారా విదేశీ మద్యం రేటు లెక్కింపు సూత్రాన్ని మార్చింది. ప్రతి బీర్‌పై దిగుమతి పాస్ రుసుము రూ. 50 లేకుండా చేయడం ద్వారా లైసెన్స్ హోల్డర్‌లకు అనుచిత ప్రయోజనం కల్పించారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది.(రిటైల్) లైసెన్స్‌దారులు టెండర్ డాక్యుమెంట్‌ల నిబంధనలను సడలించడం ద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందారు. అది కూడా లైసెన్స్ ఫీజు, వడ్డీ, పెనాల్టీ చెల్లించనందుకు అటువంటి లైసెన్స్ హోల్డర్లపై చర్య తీసుకోవలసి ఉంటుంది.టెండర్ డాక్యుమెంట్లలో ఎలాంటి నిబంధన లేకపోయినా కూడా ఢిల్లీలోని ఇతర వ్యాపారవేత్తల ప్రయోజనాలను పట్టించుకోని ఢిల్లీ ప్రభుత్వం మద్యం వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చడానికి మాత్రమే కరోనా కాలంలో జరిగిన నష్టాన్ని భర్తీ చేసే పేరుతో ప్రభుత్వం రూ. 144.36 కోట్ల లైసెన్స్ ఫీజును మాఫీ చేసింది. కొత్త విధానంలో ఎలాంటి పటిష్టమైన ప్రాతిపదిక లేకుండా, ఎవరితోనూ చర్చించకుండా, ప్రతి వార్డులో కనీసం రెండు మద్యం షాపులను తెరిచే షరతును ప్రభుత్వం టెండర్ లో చేర్చింది. తరువాత, ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌దారులకు కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి తీసుకోకుండా కన్ఫర్మ్ కాని వార్డులకు బదులుగా ఖరారు అయిన వార్డులలో అదనపు దుకాణాలను తెరవడానికి అనుమతించింది. సోషల్ మీడియా, బ్యానర్లు మరియు హోర్డింగ్‌ల ద్వారా మద్యాన్ని ప్రచారం చేస్తున్న లైసెన్స్‌దారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇది ఢిల్లీ ఎక్సైజ్ రూల్స్, 2010లోని రూల్ 26 మరియు 27ని ఉల్లంఘించినట్లు అవుతుంది.లైసెన్స్ ఫీజును పెంచకుండా లైసెన్స్ హోల్డర్‌ల ప్రయోజనం కోసం వారి కార్యాచరణ పదవీకాలం మొదట ఏప్రిల్ 1, 2022 నుండి మే 31, 2022 వరకు మరియు తరువాత జూన్ 1, 2022 నుండి జూలై 31, 2022 వరకు పొడిగించారు.

# జూనియర్ చుట్టూ ఏపీ రాజకీయం

విజయవాడ, ఫిబ్రవరి 28,జూనియర్ ఎన్టీఆర్... ప్రస్తుతం ఈ పేరు చుట్టే ఆంధ్రప్రదేశ్ రాజకీయం నడుస్తోంది?! అందులో టీడీపీని మాత్రం ఓ రేంజ్ లోనే వెంటాడుతూనే ఉంది! ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఏ కార్యక్రమంలో పాల్గొన్న... జూనియర్ ఎన్టీఆర్ నినాదాలు మార్మోగుతూన్న సంగతి తెలిసిందే. రామయ్య వస్తావయ్యా అనే ఫ్లెక్సీలు కూడా దర్శనమిస్తున్నాయి. కొన్నిసార్లు అయితే ఏకంగా జూనియర్ ఎన్టీఆర్ సీఎం అనే నినాదాలు కూడా దద్దరిల్లుతూనే ఉన్నాయి. 2019 ఎన్నికల తర్వాత... టీడీపీలో ఈ పరిస్థితి మరీ ఎక్కువైపోయింది. టీడీపీని నెక్స్ట్ లీడ్ చేసేది జూనియర్ ఎన్టీఆరే... తర్వాత అంతా ఆయనే అన్న చర్చ ఎప్పట్నుంచో ఉంది?! అయితే ఇదీకాస్త... ఈ మధ్య ఎక్కువైపోయింది. తాజాగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేసిన కొన్ని కామెంట్స్ తో .. విషయం కాస్త పీక్స్ కు చేరింది. కట్ చేస్తే... టీడీపీ నేతల రియాక్షన్స్ పెద్దగా లేనప్పటికీ... అధికారపక్షం(వైసీపీ) నుంచి మాత్రం గట్టి రీసౌండ్ వస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ గురించి లోకేశ్ మాట్లడటమేంటంటూ ఎదురుదాడి చేస్తున్న సీన్లు కనిపిస్తున్నాయి. ఇది పక్కనపెడితే... అసలు జూనియర్ ఎన్టీఆర్ అవసరం ఇప్పుడు టీడీపీకి ఉందా..? ఆయన రావాల్సిందేనా..? లోకేశ్ కామెంట్స్ పై ఇంత చర్చ ఎందుకు నడుస్తోంది..? ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీని కేవలం రాజకీయంగా మాత్రమే వాడుకోవాలని టీడీపీ చూస్తుందా..? లేక మనస్ఫూర్తిగానే ఆహ్వానిస్తుందా..? అనేది పొలిటికల్ కారిడార్ లో హాట్ టాపిక్ గా మారింది.పరిస్థితులు మనకు అనుకూలంగా లేనప్పుడు...నైతిక విలువలను గాలికి వదిలేయటం ఓ అవకాశవాదం. కానీ అది రాజకీయ నాయకుడి పరిణితిపై ఆధారపడి ఉంటుంది. సింపుల్ గా చెప్పాలంటే... 'మా బావ మనోభావాలు దెబ్బతినాయ్' అంటూ వీరసింహారెడ్డిలో బాలకృష్ణ ఓ డైలాగ్ చెప్తాడు. అచ్చం అలాగే ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీపై ప్రశ్న అడగటంతో... లోకేశ్ కూడా అదే పరిస్థితిని ఫేస్ చేశాడేమో అనిపిస్తోంది. దీనికి కారణం లేకపోలేదు... నిజంగానే జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తే... నారా నాయకత్వం పెద్దగా ఆమోదం తెలపకపోవచ్చనే చర్చ ఎప్పట్నుంచో ఉంది?! ఇక అసలు మ్యాటర్ కి వస్తే..... రాష్ట్రవ్యాప్తంగా 'యువగళం' పేరుతో లోకేశ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తిరుపతి వేదికగా 'హలో లోకేశ్' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానాలు ఇచ్చారు. అయితే జూనియర్ ఎన్టీఆర్ రాజకీయరంగ ప్రవేశంపై అడిగిన ప్రశ్నకు



లోకేశ్ రియాక్ట్ అయ్యారు.జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తే వంద శాతం ఆహ్వానిస్తామంటూ లోకేశ్ ఆన్సర్ ఇచ్చారు. ఇదే సమయంలో కొన్ని కామెంట్స్ చేశారు. ఏపీ రాజకీయాల్లో సానుకూలమైన మార్పు తీసుకురావాలన్న తపన ఉన్నవారు...ఎవరు వచ్చినా తాను స్వాగతిస్తానంటూ మాట్లాడారు. ఇక్కడ మాత్రం జూనియర్ ఎన్టీఆర్ పేరు చెప్పకుండానే ఈ వ్యాఖ్యలు చేశారు లోకేశ్. అయితే టీడీపీ స్థాపకుడు, సీనియర్ ఎన్టీఆర్ మనవడిగా పేరొందిన జూనియర్ ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీపై సర్వత్రా చర్చ జరగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లోకేశ్ స్వాగతించటం తెలివైన జవాబే కావొచ్చు... కానీ మరోవైపు అదే జూనియర్ ఎన్టీఆర్... లోకేశ్ రాజకీయ భవిష్యత్తుకు అవరోధంగా మారుతారన్న భావన కూడా ప్రస్తుత టీడీపీ నాయకత్వంలో ఉందనే వాదన తెరపైకి వస్తోంది. ఇక వారసత్వ పోరులో ఉద్దేశపూర్వకంగానే జూనియర్ ఎన్టీఆర్ తో పాటు... సీనియర్ ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను చంద్రబాబు పక్కన పెట్టారనే వాదన కేడర్ లో ఎప్పట్నుంచో ఉంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో లోకేశ్ కామెంట్స్ ఆసక్తికరంగా మారాయనే చర్చ నడుస్తోంది.భవిష్యత్ లో టీడీపీ బాధ్యతలు ఎవరికి ఇవ్వాలన్న దానిపై చర్చ జరిగితే లోకేశ్ కు పోటీగా జూనియర్ ఎన్టీఆర్ రేసులోకి రావొచ్చన్న చర్చ ఉంది. అయితే 2009 ఎన్నికల్లో టీడీపీ తరపున ప్రచారం చేశారు జూనియర్ ఎన్టీఆర్. పార్టీ విజయం కోసం తీవ్రంగా కృషి చేశారు. కానీ ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమిపాలైంది. ఈ పరిణామాన్ని జూనియర్ ఎన్టీఆర్ ఫెయిల్యూర్ గా చూపిస్తే?. లోకేశ్ కు లైన్ క్లియర్ అయ్యే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన(2014) తర్వాత... రాజకీయముఖ చిత్రం మారిపోయింది. ఏపీ, తెలంగాణ వేర్వేరు కాగా.. నవ్యాంధ్రలో జరిగిన తొలి ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ఓవైపు ప్రభుత్వాన్ని నడుపుతూనే... మరోవైపు తన రాజకీయలక్ష్యాన్ని కూడా నెరవేర్చే ప్రయత్నాలు చేశారు. పూర్తిగా జూనియర్ ఎన్టీఆర్ ను పక్కనపెట్టేశారు చంద్రబాబు. ఆయన కుమారుడైన నారా లోకేశ్ ను కేంద్రబిందువుగా మార్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇక గతం చూస్తే 1995లో కూడా జూనియర్ ఎన్టీఆర్ తండ్రి హరికృష్ణను పార్టీలైన్ నుంచి తప్పించేలా చేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం జూనియర్ ఎన్టీఆర్ మనసులో బలంగా నాటుకుపోయిందన్న చర్చ కూడా ఉంది.ఇక లోకేశ్... ఎన్టీఆర్ ను స్వాగతించటం వెనక మరో కోణం ఉందన్న చర్చ కూడా తెరపైకి వస్తోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన పొత్తు ఉంటుందన్న వాతావరణం నెలకొంది. అయితే ఈ మైత్రికి జనసేనలోని ఓ వర్గం ఆమోదం తెలపడం లేదంట?! సొంతంగానే పోటీ చేయాలని ఆ పార్టీ అధినేత పవన్ కు సూచిస్తున్నారని తెలుస్తోంది. ఫలితంగా వచ్చే ఎన్నికల్లో కూడా టీడీపీ ఒంటరిగా పోటీ చేయాల్సి వస్తుంది. ఇదీ కాస్త ఆ పార్టీకి పెద్ద సమస్యగా మారొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే లోకేశ్... జూనియర్ ఎన్టీఆర్ ను స్వాగతిస్తూ మాట్లాడారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక లోకేశ్ పాదయాత్ర వెనక కూడా పెద్ద మంత్రాంగమే నడిచిందని తెలుస్తోంది. తనని తాను నిరూపించుకునేందుకే పాదయాత్ర పేరుతో లోకేశ్ ను టీడీపీ నాయకత్వం ప్రజల్లోకి పంపించిందన్న చర్చ జోరుగా ఉంది. దీనికి కారణం కూడా జూనియర్ ఎన్టీఆర్ అన్న వాదన బలంగా ఉంది. ఎందుకంటే... పార్టీలోకి జూనియర్ ఎన్టీఆర్ ను ఆహ్వానించాలన్న స్వరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ముందస్తుగా లోకేశ్ ను చంద్రబాబు సిద్ధం చేస్తున్నారన్న కోణంలో వార్తలు వస్తున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి చంద్రబాబు వయసు కూడా 73 ఏళ్లకు చేరుతుంది. ఆరోజు నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించలేం. ఈ విషయాన్ని ముందుగానే గ్రహించిన చంద్రబాబు... లోకేశ్ ను లీడర్ గా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకున్నట్లు అర్థమవుతోంది. పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్తే... ఆదరణ దక్కే అవకాశం ఉంటుంది ఆయన అంచనా..! ఇదే కనుక చేయకపోతే పార్టీ నాయకత్వ బాధ్యతలు చూసే విషయంలో లోకేశ్ వెనకబడే అవకాశం ఉంది.

# రాధా మళ్లీ పార్టీ మార్పు ప్రచారం

విజయవాడ, ఫిబ్రవరి 28, వంగవీటి రాధా.. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని పేరు. ఆయన రాజకీయ పయనంపై ఎలా ఉండబోతోంది.. 2024 ఎన్నికలు, రాజకీయ భవిష్యత్‌పై క్లారిటీతో ఉన్నారా. టీడీపీలోనే కొనసాగుతారా, పార్టీ మారిపోతారా. కొద్దిరోజులుగా ఇవే ప్రశ్నలు వెంటాడుతున్నాయి.. పార్టీ మారతారని ప్రచారం జరుగుతున్నా.. రాధా మాత్రం తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాజాగా రాధా పార్టీ మారతారని



మరో ప్రచారం జరుగుతోంది.రాధా త్వరలోనే టీడీపీకి గుడ్ బై చెబుతారనే ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.. ఆయన పార్టీ మారడం ఖాయం అంటున్నారు. వంగవీటి జనసేన పార్టీలో చేరబోతున్నట్లు ఐహాగానాలు వినిపిస్తున్నాయి. ఏకంగా ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు.. మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ సభ ఉంది. అదే రోజు పవన్ కళ్యాణ్ సమక్షంలో చేరిక ఉంటుందని చెబుతున్నారు. అలాగే మార్చి 22 ఉగాది రోజున చేరే అవకాశం ఉందంటున్నారు. రాధా చేరికకు జనసేనాని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చెబుతున్నారు. వంగవీటితో పాటు యలమంచిలి రవి, పలువురు నేతలు పవన్ సమక్షంలో కండువా కప్పుకుంటారని చెబుతున్నారు.వంగవీటి రాధా జనసేనలో చేరితే.. ఎక్కడి నుంచి పోటీ చేస్తారో కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేస్తారని చెబుతున్నారు. అయితే ఒకవేళ టీడీపీ, జనసేనల మధ్య పొత్తు ఉంటే సీట్ల సర్దుబాటు సమస్య కూడా ఉంది. ఒకవేళ జనసేన నుంచి రాధా పోటీ చేస్తే.. టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోంది. బొండా ఉమకు టీటీడీప ప్రత్యామ్నాయం చూపించాల్సి ఉంటుంది. దీంతో రాజకీయం ఆసక్తికరంగా మారింది.రాధా 2004లో విజయవాడ తూర్పు నియోజకవర్గ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. విజయవాడ 2009లో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన వంగవీటి మల్లాది విష్ణు చేతిలో అతి తక్కువ మెజార్టీతో ఓడిపోయారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరిన రాధా.. 2014 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల సమయంలో టీడీపీలో చేరిన ఆయన.. ఎక్కడి నుంచి పోటీ చేయలేదు. టీడీపీ అభ్యర్థుల తరపున ప్రచారానికి పరిమితం అయ్యారు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత రాధా రాజకీయాలకు కాస్త దూరంగా ఉంటున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలవడంతో పార్టీ మారతారని అప్పట్లోనే ఊహాగానాలు వినిపించాయి. అమరావతి రైతుల ఉద్యమానికి మద్దతు తెలిపారు.. రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలకు మాత్రం హాజరవుతున్నారు. రాధా టీడీపీలోనే ఉన్నారని చెబుతున్నా.. ఆయన మాత్రం పార్టీ సమావేశాలు, కార్యక్రమాలకు హాజరు కావడం లేదు.

## నిలిచిపోయిన హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు..రెరా ఆగ్రహం

గుంటూరు, ఫిబ్రవరి 28,ఎన్నికలకు ముందు అమరావతి ప్రాంతంలో సిఆర్‌డిఏ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు ఎన్నికల తర్వాత అనూహ్యం నిలిచిపోయింది. రికార్డు సమయంలో నిర్మాణానికి ముందే వేలంలో విక్రయాలు పూర్తైన హ్యాపీనెస్ట్ పథకంలో సొంతిళ్లను దక్కించుకునేందుకు ప్రవాస భారతీయులతో పాటు మధ్యతరగతి, ఉన్నత ఆదాయ వర్గాల ప్రజలు పోటీలు పడ్డారు.ఆన్‌లైన్ బిడ్డింగ్ పథకానికి పెద్ద ఎత్తున ఆదరణ లభించింది. అయితే ఆ తర్వాత వారికి కష్టాలు తప్పలేదు.రాజధాని అమరావతిలో భాగంగా తలపెట్టిన హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు నిర్మించి ఫ్లాట్లను కొనుగోలుదారులకు అప్పగించడంలో సీఆర్‌డీఏ విఫలమైనందుకు వడ్డీ చెల్లించాలంటూ ఆంధ్రప్రదేశ్ స్థిరాస్థి వ్యాపార నియంత్రణ సంస్థ -ఏపీ రెరా కీలక తీర్పునిచ్చింది.పిటిషనర్లు చెల్లించిన సొమ్ముపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రైమ్ లెండింగ్ రేటుతో పాటు మరో 2% కలిపి మొత్తం 16.15% వడ్డీ చెల్లించాలని పేర్కొంది. 2021 జూన్ 30 నుంచి ఫ్లాట్లను స్వాధీనపరిచేంత వరకు వడ్డీ సొమ్ము చెల్లించాలని తేల్చి చెప్పింది. రెరా సభ్యుడు చందు సాంబశివరావు ఈ మేరకు కీలక తీర్పునిచ్చారు. హ్యాపీనెస్ట్ నిర్మాణంలో జాప్యమేర్పడినందున తాము చెల్లించిన సొమ్ముకు వడ్డీ చెల్లించాలని ఏపీసీఆర్‌డీఏ కమిషనర్‌పై మద్దినేని వెంకటసాయిబాబు, మరో 11 మంది రెరాను ఆశ్రయించారు.ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసేలా ఆదేశించాలని కోరారు. మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. వారి తరపున న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదనలు వినిపించారు. ఒప్పందం ప్రకారం అపార్టుమెంటును 2021 డిసెంబరుకు అప్పగిస్తామన్నారని, ఇందులో సీఆర్‌డీఏ విఫలమైందని వివరించారు.రిజిస్ట్రేషన్‌కు సమయం పొడిగించినంత మాత్రాన ఫ్లాటు యజమానుల హక్కులకు భంగం కలిగించడానికి వీల్లేదని రెరా ఇచ్చిన నోటిఫికేషన్‌లో పేర్కొందని తెలిపారు. మరోవైపు సీఆర్‌డీఏ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రాజెక్టు రిజిస్ట్రేషన్ కాలాన్ని ఏపీ రెరా పొడిగించిందని తెలిపారు. ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు గుత్తేదారును ఏర్పాటు చేసుకునే దిశలో సీఆర్‌డీఏ ముందుకెళుతోందని వివరించారు. సీఆర్‌డీఏ వాదనలను రెరా సభ్యుడు తోసిపుచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఆర్‌డిఏ చేపట్టిన అన్ని ప్రాజెక్టుల్ని ప్రభుత్వం నిలిపివేసింది. మిగిలిన ప్రాజెక్టులుప్రభుత్వం సొంతంగా చేపట్టినవి కావడంతో పెద్దగా చిక్కులు తలెత్తలేదు. హ్యాపీనెస్ట్ పథకంలో సొంతింటి కల నెరవేర్చుకోడానికి సాధారణ ప్రజలు పెట్టుబడులు పెట్టడంతో సిఆర్‌డిఏ చిక్కుల్లో పడింది. మూడున్నరేళ్లకు పైగా ఒక్క అడుగు కూడా ప్రాజెక్టు పనుల్లో ముందడుగు సాధించలేకపోయింది. రాజధానిని అమరావతి నుంచి విశాఖపట్నం తరలించాలనే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం హ్యాపీనెస్ట్‌పై పెద్దగా దృష్టి పెట్టలేదు. దీంతో ప్రాజెక్టులో ప్రాజెక్టుల్లో ఇళ్లను కొనుగోలు చేసిన వారు నిండా మునిగిపోయారు.

# రైతులను నిలువునా దగా చేస్తున్న జగన్

మచిలీపట్నం సీఎం జగన్ రైతులను నిలువునా దగా చేస్తున్నారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. రైతుల భరోసా పేరుతో రైతులను నిలువునా ముంచేశారు. ఎన్నికల ముందు రైతులకు 15 వేలు ఇస్తామన్నారు. ఎన్నికల తరువాత 7500 ఇస్తున్నాడు, కేంద్ర ఇస్తున్న 6 వేలు కలుపుకొని 13500 ఇస్తున్నామని డబ్బా కొడుతున్నాడు. రైతు భరోసా పేరుతో జగన్ చెప్పేవన్నీ అబద్దాలేరైతులకు వేల కోట్ల సాయం చేశామంటూ ఇచ్చిన ప్రకటనలన్నీ మోసం, మాయ అని అన్నారు. రైతుల ఆత్మ హత్యల్లో ఆంధ్ర ప్రదేశ్ 3 వ స్థానంలో వుంది. ఇప్పటివరకు 3 వేలమంది రైతులు ఆత్మ హత్యలకు పాల్పడ్డారు. ఎన్నికల ముందు ధరల స్థిరీకరణ నిధి అన్నాడు, ఎంత మందికి ఇచ్చాడు. ధాన్యం కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నాడు. ధాన్యం కొనుగోళ్ల లో లేనిపోని షరతులు పెట్టి రైతులను రోడ్డు న పడేసాడు. ఏ పంటకు మద్దతు ధర లభించలేదు, ధాన్యం సేకరణకు 37 లక్షల టన్నులకు కుదించారు. జగన్ మరిన్ని అప్పుల కోసం మోటార్లకు, మీటర్లు పెట్టి రైతు మెడకు వురి బిగిస్తున్నారు. ఆక్వా రంగాన్ని నాశనం చేసాడు. ఎన్నికల ముందు యూనిట్ 1.50 పైసలకు ఇస్తానన్నాడు. అధికారంలోకి వచ్చిన తరువాత 5.50 పైసలు చేసాడు. ఆక్వా జోన్ లు అని రైతులను నిలువునా ముంచాడని అన్నారు. వ్యవసాయంలో క్రాపు హాలిడే లాగ, ఆక్వా లో కూడా హాలిడే ప్రకటిస్తున్నారు. గత ప్రభుత్వంలో కరెంట్ బిల్ పది వేలు, ఇరవై వేలు వస్తుంటే ఇప్పుడు డెబ్బై వేలు, లక్ష వస్తుంది. రైతులు వడ్డీలు కట్టలేక ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారు, అక్రమ కేసులు పెడుతున్నారు. ఇప్పటికైనా రైతులకు ప్రభుత్వం మాయమాటలు కాకుండా నిజాయతీతో వారికీ మద్దతుగా నిలవాలని అన్నారు.ప్రకటనలు కాకుండా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి.

## రిపోర్టర్ల పై కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి

కామనురు. శ్రీనువాసులు రెడ్డి

కడప శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలో నలుగురు రిపోర్టర్ల పై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనురు. శ్రీనువాసులురెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కదిరి పట్టణంలో రెండు రోజుల క్రితం జరిగిన హింసాత్మక ఘటనలు, అనంతరం చోటు చేసుకున్న పరిణామాలను కవర్ చేస్తున్న విలేఖర్ల పై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటన లో పేర్కొన్నారు. మహిళ కౌన్సిలర్ పై సీఐ తమ్మిశెట్టి మధు వ్యాఖ్యల కు నిరసన తెలపడానికి వెళ్లిన మహిళలపై లాఠీ ఛార్జ్ జరిగిన ఘటన కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై దుర్భాషలాడుతూ దాడి చేయడమే కాకుండా పోలీస్ కేసులను నమోదు చేయడం దుర్మార్గమని తెలిపారు. రిపోర్టర్ల నుంచి సెల్ ఫోన్లు లాక్కొని, దాడికి పాల్పడిన పోలీసులపై తక్షణమే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ వ్యవహారం పై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. కదిరిలో మీడియా ప్రతినిధులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోకపోతే , రిపోర్టర్ల చేయు ఆందోళన కార్యక్రమాలు సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.

# నందవరంలో ఘనంగా టైలర్స్ దినోత్సవ వేడుకలు

నందవరం ప్రాచీన కాలంలో ఆనాటి సమాజంలో ఒక వెలుగు వెలిగిన దర్జీలు నేటి ఆధునిక సమాజంలో చాలా దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని కావున ప్రభుత్వం దర్జీలను ఆదుకోవాలని నందవరం మండల టైలర్ అసోసియేషన్ అధ్యక్షులు టైలర్ వలి తెలియజేశారు .ముందుగా నందవరం మండల టైలర్ అసోసియేషన్ తరపున కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం నందవరంలో సీనియర్ టైలర్ ఇస్మాయిల్ ను నందవరం మండల ట్రైలర్ అసోసియేషన్ అధ్యక్షులు టైలర్ వలి శాలువా ,పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదిమంది టైలర్స్ కు ఉచితంగా కత్తెరలు , టేపులు అందజేశారు. మంగళవారం మండల కేంద్రమైన నందవరం నందవరం మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు .ఈ సందర్భంగా నందవరం మండల టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు టైలర్ వలి మాట్లాడుతూ ఈ ఆధునిక కాలంలో ప్రజలకు ఆధునిక యంత్రాల ద్వారా తయారైనటువంటి రెడీమేడ్ దుస్తులు మార్కెట్లోకి రావడంతో వాటి మీద ఆకర్షితులయ్యారు.దీంతో సాధారణ దర్జీల పరిస్థితి చాలా దుర్భరంగా మారిందన్నారు .కావున ప్రభుత్వము ఇప్పటికే అర్హులైన వారికి పదివేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇది ఏమాత్రం దర్జీల పరిస్థితికి సరిపోదన్నారు. అంతరించిపోతున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాల్సిన ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నందవరం మండల టైలర్ అసోసియేషన్ అధ్యక్షులు టైలర్ వలి, శశికళ, కైరున్ ఏసమ్మ ఏసేపు వీరేష్ ఇస్మాయిల్ ,చాంద్ భాషా, డానియల్ ,షేక్షావలి, లక్ష్మన్న, ఈరన్న (పూలచింత) వెంకటేశ్వర్లు ,చాకలి వీరేష్ , దానమయ్య శమంతకమణి లక్ష్మీ ,మల్లీశ్వరి,నజమున్నిసా, పర్వీన్ ,జ్యోతి ,గోవిందమ్మ , తదితరులు పాల్గొన్నారు .

# వెంచర్ల మాయజాలం

పలు వెంచర్లలో నాలుగు నుంచి ఐదు ఎకరాల
వరకు ప్రభుత్వ భూములు
పలు వెంచర్లకు రెవెన్యూ దన్ను
అన్ని నిబంధనలు తుంగలోకి గాలిలోకివెంచర్ల
రెవెన్యూ గారడీపై గతంలోనే బద్వేల్ మాజీ ఎమ్మెల్యే
పలు ఆరోపణలుతిలాపాపం తలా పిడికెడు







బద్వేలు గోపవరం మండలం లో చాలాకాలంగా వెంచర్ల మాయాజాలం నడుస్తుంది పలు వెంచర్లు నిబంధన లు తుంగలో తొక్కి అమాయక ప్రజలతో ఆడుకుంటున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం వీరి అవినీతి అక్రమాలకు కొందరు రెవెన్యూ అధికారులు కొంతమంది సిబ్బంది దన్నుగా నిలిచారుగోపవరం మండలం జాతీయ రహదారి 67 పక్కన పలు వెంచర్లు ఉన్నాయి వీటిలో చాలా వాటికి అనుమతులు లేవు నిబంధనలు పక్కనపెట్టి అమాయక ప్రజలతో ఆడుకుంటూ లక్షల లక్షలు దండుకుంటున్నారు అంతేగాక పలు వెంచర్లలో నాలుగు నుంచి ఐదు ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి ఈ విషయాన్ని గతంలోనే గోపవరం రెవెన్యూ అధికారులు బహిర్గతం చేశారు ఈ విషయంలో బద్వేల్ మాజీ ఎమ్మెల్యే ఒకరు ఆధారాలతో సహా బయట పెట్టారు అప్పట్లోనే పలు వెంచర్లలో రెవెన్యూ అధికారులు కొంతమంది కొంతమంది రెవిన్యూ సిబ్బంది అవినీతిని బట్టబయలు చేయడమే కాకుండా వారు తీసుకున్న వాటాలు ముడుపులు ఆధారాలతో సహా విలేకరుల సమావేశంలో ఆ మాజీ ఎమ్మెల్యే బట్టబయలు చేయడం జరిగింది అప్పట్లో ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది ఇప్పటికీ అదే పద్ధతి సాగిస్తున్నారు ముడుపులు దండుకున్న రెవెన్యూ సిబ్బంది తేలు కుట్టిన దొంగల ఉండిపోయారా తప్ప మాజీ ఎమ్మెల్యేచేసిన ఆరోపణ కనీసం ఖండించలేకపోయారు ఇలాంటి అవినీతి రెవెన్యూ ఉద్యోగులు సిబ్బంది ఇప్పటికీ అక్కడే తిష్ట వేసి ఉండడం విశేషం రెవెన్యూ సిబ్బంది కాకుండా ఇద్దరు ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు కూడా ఉండడం విశేషం గోపవరం మండలంలో రెవెన్యూ అధికారులు కొంతమంది సిబ్బంది కొంతమంది కొంతమంది పంచాయతీ కార్యదర్శులు కేవలం ఉత్సవ విగ్రహాల మిగిలిపోయారు మండలం మండలంలోని మునుపటి మడకలవారిపల్లె రెవెన్యూ చాలా భాగం బద్వేల్ పట్టణంలో ఉంది మడకలవారిపల్లె రెవెన్యూ పరిధిలోకి వచ్చే నెల్లూరు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఒక వెంచర్ ఏర్పాటయింది ఈ వెంచర్ లో కూడా మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉన్నట్లు సమాచారం ఈ విషయం పై నిజాలు బయటి తీసే అధికారులు లేకుండా పోయారు వ్యవసాయ రిజిస్టర్ భూములు వాటిని ఇంటి స్థలాలుగా మార్పు చేయాలంటే అనేక శాఖ అనుమతులు పొందవలసి ఉంటుంది గోపవరం మండలంలోని పలు వెంచర్లకు చాలా వరకు అనుమతులు లేవు కానీ అనుమతులు ఉన్నట్లు చెబుతుంటారు రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ దారులకే వంత పాడుతూ ఉంటారు ఇందుకు కారణాలు కూడా లేక పోలేదు వెంచర్ దారుల నుండి వారు తీసుకున్న భారీ ముడుపులే ఇందుకు కారణమని చెప్పాలి రిజిస్టర్ వ్యవసాయ భూములు ఇంటి స్థలాలుగా మార్పు కావాలంటే చాలా అనుమతులు అవసరమవుతాయి వ్యవసాయ భూముల్లో చేపట్టిన ప్లాన్ ముందుగా సంబంధిత పంచాయతీకి పంపవలసి ఉంది అక్కడి నుండే ముడుపుల దందా మొదలవుతుంది అక్కడి స్థలములో మురికి కాలువలు రహదారుల కోసం 10 శాతం భూమిని గ్రామపంచాయతీ పేరుతో రిజిస్టర్ చేయించాలి ప్లాన్ ఆమోదం పొందిన తర్వాత పంచాయతీకి ఫీజు చెల్లించాలి పంచాయతీ ఆమోదం మేరకు లేఅవుట్లు వేసి క్రయవిక్రయాలు చెయ్యాలి లేఅవుట్లు వచ్చేటప్పుడు వేసిన తర్వాత గాని కొంతమంది రెవెన్యూ సిబ్బందితోపాటు మరి కొంతమంది పంచాయతీ సిబ్బందికి బహుమతిగా కొన్ని ప్లాట్లు ఇచ్చినట్లు సమాచారం లక్షలాది రూపాయలు విలువచేసే ఈ ప్లాట్లు బహుమతిగా కొంతమంది అధికారులు మరి కొంతమంది సిబ్బంది వారికి అన్ని విషయాల్లో సహకరించినట్టు సమాచారం గతంలో పలు వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నిబంధనలు సక్రమంగా లేకపోవడంతో ఇప్పుడు లబోదిబో అంటున్నారు తాముచ్చిన డబ్బు వెనక్కి ఇవ్వాలని పట్టుబడుతున్నారు ఇలాంటి కేసులు ఇటీవల కాలంలో మరింత ఎక్కువ అయ్యాయి గోపవరం మండలంలోని పి పి కుంట సమీపంలో వేసిన వెంచర్ ఇటీవల కాలంలో వివాహాస్పదమైంది ఈ వెంచర్ కి సంబంధించి ఎలాంటి అనుమంతులు లేవని సమాచారం ఈ విషయాన్ని అధికారులు కూడా అంగీకరిస్తున్నారు కానీ ఈ వెంచర్ లో క్రయ విక్రయాలు బాగానే జరిగినట్లు సమాచారం వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు ఇందుకు కారణం కూడా లేకపోలేదు తీసుకున్న భారీ ముడుపులు బహుమతులు ఇందుకు కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి

# ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఒక బృహత్తర కార్యక్రమం

భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత
ఆంధ్రప్రదేశ్ విభిన్న భాషల సంస్కృతి సంప్రదాయాలు సమ్మేళనం
యువత దేశానికి వెన్నెముక
మనం చేపట్టే ప్రతి పనిలో మానవీయ కోణం ఉండాలి:కలెక్టర్

తిరుపతి, ,ఫిబ్రవరి 28: భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత అని, ఆంధ్రప్రదేశ్ విభిన్న మాండలిక భాషల సంస్కృతి సంప్రదాయాల సమ్మేళనం అని, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు అందరూ తెలుసుకునేలా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుంది అని ఐ. ఐ. టి. తిరుపతి లో యువసంగం సహకారం ఎంతో అభినందించదగినదని తిరుపతి జిల్లా కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఏర్పేడు ఐఐటి నందు ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్ నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి కి 24 ఫిబ్రవరి నుండి మార్చి1 వరకు క్షేత్ర స్థాయి పర్యటనకు విచ్చేసిన 28 మంది ఉన్నత స్థాయి విద్యార్థుల బృందం మరియు వారి అధ్యాపకులతో ముఖా ముఖిలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువ సంగం ఈ చక్కని కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఈ యాత్రలో భాగంగా దేశంలోని విభిన్న ప్రాంతాల సంస్కృతులు , సంప్రదాయాలు, పర్యాటక ప్రాంతాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై అన్ని ప్రాంతాల వారికి తెలియజేయాలనీ, అందులోని మంచి అనుభవాలను గ్రహించి వారి రాష్ట్రాలలో వారి ప్రాంతాలలో వాటిని అమలు చేసే విధంగా వుండాలని అన్నారు. విభిన్న రంగాలలో సుస్థిర అభివృద్ధి సాధించే దిశలో ఉపయోగపడే అంశాలను అమలు చేసి ఆ ప్రాంత ప్రజల సమాజ అభివృద్ధికి దోహదం చేసే గొప్ప ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. మన దేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, భారత ప్రజల మధ్య విభిన్న మాటలు, కులాలు, భాషలు ఉన్నా కూడా వారి మధ్య సుహృద్భావ ఐకమత్యాన్ని పెంపొందించే దిశలో ఈ బృహత్తర కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని అన్నారు.మన రాష్ట్రానికి చెందిన యువత ఇతర రాష్ట్రాలకు, ఇతర రాష్ట్రాలకు చెందిన యువత మన రాష్ట్రానికి వచ్చి ఆచారాలు, సంప్రదాయాలు, చరిత్ర తెలుసుకోవడం ద్వారా మన భారతదేశం గొప్పతనం, విభిన్న సంస్కృతులు కలిగి భౌగోళిక, వాతావరణ పరిస్థితులు కొండ ప్రాంతాలు మెట్ట తదితర అంశాల సమ్మేళనం అని, మన దేశంలోని ప్రతీ రాష్ట్రంలో ఎంత గొప్ప చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయో తెలుసుకోగలుగుతారని వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తెలుగు భాషలో విభిన్న మాండలిక భాషలతో రాయలసీమ, కోస్తా, ఉత్తర కోస్తా జిల్లాల సమూహమని 975 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం కలిగి పలు ఓడరేవులు కలిగినదని అన్నారు. రాష్ట్రంలో సాధారణంగా ఉండే విశ్వ విద్యాలయాలతో పాటు ప్రత్యేకమైన వేదిక్ విశ్వవిద్యాలయం, సంస్కృత విశ్వవిద్యాలయం ఉన్నాయని అన్నారు. విజయనగర సామ్రాజ్య కాలంలో నిర్మితమైన చంద్రగిరి కోట ఒక గొప్ప పురాతన చారిత్రాత్మక కట్టడం అని, శ్రీ సిటీ ఒక్క పారిశ్రామిక వాడలోనే 28 దేశాలకు చెందిన 200 పరిశ్రమలు పైగా ఉన్నాయని, రేణిగుంట విమానాశ్రయం సమీపంలో రెండు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఉన్నాయని తిరుపతి–విశాఖపట్నం– విజయవాడ ప్రాంతాలలో పలు పారిశ్రామిక హబ్ లు ఏర్పడి వీటన్నింటిలో అనేక వేల మంది నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్యం కలవారికి పెద్ద ఎత్తున ఉపాధి కల్పించబడుతోందని అన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ గారి మాటలను గుర్తు చేసుకుంటూ జాతీయ సమైక్యత విద్యతోనే సాధ్యమని గుర్తించాలని కోరారు. సుస్థిర సమగ్ర అభివృద్ధి అన్ని రంగాలలో దేశంలోని అన్ని ప్రాంతాల్లో అమలైనప్పుడే సాధ్యమని, దానిని సాధించడానికి ఈ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యంగా ఏడు ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల జీవన విధానంలో ఎన్నో మార్పులు తెచ్చే విధంగా వారి నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి గిరిజన ప్రాంతాలకు రహదారులు ఏర్పాటు చేసి గర్భిణీ స్త్రీలకు వసతి, ఆసుపత్రిలో ప్రసవం కల్పించుట, గిరిజన సంక్షేమ హాస్టల్లు, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యను ప్రోత్సహించి వారి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, అటువంటి ప్రాంతాలను సందర్శించి వాటిలో సమగ్ర అభివృద్ధికి దోహదం చేసిన అంశాలను, అనుభవాలను ఆకలింపు చేసుకొని తమ రాష్ట్రాలలో తమ ప్రాంతాలలో వాటిని అమలు చేసి పేదవారి అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు. మనం చేసే పనిలో మానవత్వం , మానవీయకోణం తప్పక ఉండాలని అప్పుడే మనకు ఆత్మ సంతృప్తి కలుగుతుందని, దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, భారతదేశానికి యువతనే వెన్నెముకని తెలుపుతూ సుస్థిర అభివృద్ధి అనేది పర్యావరణ హితంగా ఉండాలని అన్నారు. క్షేత్రస్థాయిలో మీ యొక్క అనుభవాలను పరిశీలనలను సలహాలను ఒక ప్రాజెక్టు రిపోర్టు రూపంలో ప్రభుత్వానికి అందజేసి పేదల అభ్యున్నతికి ఉపయోగపడేలా, ఒక దిక్సూచి లా ఉండాలని అప్పుడే ఈ కార్యక్రమానికి సాఫల్యత చేకూర్చిన వారు అవుతారని అన్నారు.ఐ ఐ టి సంచాలకులు సత్యనారాయణ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో 1953వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, నేడు ఆంధ్రప్రదేశ్ 26 జిల్లాలు ఏర్పాటుతో తిరుపతి జిల్లా కలెక్టర్ గా వెంకటరమణారెడ్డి గారు విశిష్టమైనటువంటి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. తిరుపతి జిల్లాలో తిరుమల శ్రీవారి ఆలయము ఇతర ప్రముఖ ఆలయాలు కలిగి, పరిశ్రమలు, వివిధ రవాణా సౌకర్యములు కలిగిన ప్రాంతమని అనేక మంది వివిధ ప్రాంతాల రాష్ట్రాల పర్యాటకులు ప్రముఖులు సందర్శన ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం ఉత్తర భారత దేశం నుండి దక్షిణ ప్రాంతాల పర్యటనలతో ఏకత్వం సమైక్యత సాధన దిశగా ఏర్పడిందని అన్నారు. తిరుపతి ప్రాంత ప్రత్యేకతలు, చరిత్ర, సంప్రదాయాలన్నింటినీ ఇతర రాష్ట్రాల వారు తెలుసుకునేలా ఈ ఏక్ భారత్ శ్రేష్ట భారత యువ సంగం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు మరింత విజ్ఞానాన్ని పెంపొందింప చేసుకోవాలని, నూతన ఆవిష్కరణలకు ఇలాంటి యాత్రలు ఉపకరిస్తాయని అన్నారు.ఇందులో అరుణాచల్ ప్రదేశ్ నుండి వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం వెంకటేశ్వరుని ప్రతిమను కలెక్టర్ ఐఐటి డైరెక్టర్ తో కలిసి ఈ బృందానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐఐటి కాలేజ్ సిబ్బంది, యువ సంగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సమంత మరిచింది.. కానీ చై మాత్రం..!

నాగచైతన్య సమంత విడాకులు తీసుకుని ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తమ తమ పనుల్లో మునిగిపోయారు. అప్పటి నుంచి ప్రతీ సందర్భంలోనూ సమంత అభిమానులు చైతూ సినిమాలకు సంబంధించి ఏం ట్వీట్ చేసినా సామ్ ని ట్యాగ్ చేయడం లేదని కంప్లీట్ గా తనని అవాయిడ్ చేస్తున్నాడని కామెంట్ లు చేస్తున్నారు. అయితే తాజాగా సమంతతో కలిసి వున్న ఓ ఫొటోని నాగచైతన్య సోషల్ మీడియా వేదికగా షేర్ చేయడం సమంత అలా చేయలేకపోవడం ఆసక్తికరంగా మారింది.వివరాల్లోకి వెళితే.. నాగచైతన్య సమంత కలిసి నటించిన మూవీ 'ఏమాయ చేసావె'. ఇది సమంతకు హీరోయిన్ గా తొలి సినిమా. ఇదే సినిమా టైమ్ లో ఇద్దరి మధ్య స్నేహం కుదరడం.. ఆ తరువాత అది ప్రేమగా మారడం పెళ్లికి దారితీయడం తెలిసిందే. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట ఇటీవల విడిపోయి అభిమానులకు షాకిచ్చారు. గత కొన్ని నెలలుగా విడిపోయి ఎవరి దారిలో వాళ్లు సినిమాలు చేసుకుంటున్నారు.వీరిద్దరు కలిసి నటించిన 'ఏమాయ చేసావె' మూవీ 13 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నాగచైతన్య ఇన్ స్టా స్టోరీస్ లో సమంతతో కలిసి వున్న ఓ పోస్టర్ ని 'సెలబ్రేటింగ్ 13 ఇయర్స్' అంటూ అభిమానులతో పంచుకున్నాడు. కానీ సమంత మాత్రం అలా చేయలేదు. దీనికి తోడు ఆసక్తికరంగా స్పందించింది. ఇప్పటి వరకు తనని ఎన్నో విషయాలు బాధించాయని ఇకపై తనని ఏదీ బాధపెట్టలేదని స్పందించింది. 'ఏమాయ చేసావె' మూవీ 13 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సామ్ అభిమానులని ఉద్దేశించి ఆసక్తికరంగా స్పందించింది.తనపై ప్రేమని చూపిస్తున్న అభిమానులకు కృతజ్ఞతలని వాళ్ల ప్రేమ వల్లే తాను ఈ స్థాయిలో వున్నానని ఇది ఎప్పటికీ ఇలాగే వుండాలని కోరుకుంటున్నానని తెలిపింది. 'నేను ఎంత ఎదిగినా.. ఎంత దూరం ప్రయాణించినా మీరు చూపించే ప్రేమాభిమానాన్ని మర్చిపోలేనంది. నా పై ఇంతటి ప్రేమాభిమానాలని చూపిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపింది. అలాగే కొత్త విషయాలని పరిచయం చేస్తున్న ప్రతీ రోజుకు ధన్యవాదాలు తెలిపింది.గతంలో నన్ను ఎన్నో విషయాలు బాధించేవి. కానీ ఇకపై కాదు. కేవలం ప్రేమ కృతజ్ఞతతో కొనసాగుతున్నా' అంటూ చెప్పుకొచ్చింది. అయితే ఇన్ స్టాలో 'ఏమాయ చేసావే' 13 ఇయర్స్ సెలబ్రేషన్స్ అంటూ సామ్ తో వున్న ఫొటోని షేర్ చేసిన నాగచైతన్య దాన్ని సామ్ కు ట్యాగ్ చేయకపోవడం గమనార్హం. ఇదిలా వుంటే మయోసైటీస్ నుంచి కోలుకున్న సమంత మళ్లీ షూటింగ్ లలో పాల్గొంటూ నెట్టింట కూడా హుషారుగా పోస్ట్ లు పెడుతూ కనిపిస్తుండటం విశేషం.







# మహేష్ - త్రివిక్రమ్ సినిమాకి పూజా టెన్షన్!



సర్కారు వారి పాట సినిమా తర్వాత మహేష్ బాబు త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంకా పేరు పెట్టను ఈ సినిమాని సూపర్ స్టార్ మహేష్ బాబు 28 పేరుతో సంభోదిస్తున్నారు. పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల మరో హీరోయిన్ గా నటిస్తోంది. హారిక హాసిని క్రియేషన్స్ బ్యానర్ మీద త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ ఇప్పటికే 30% పూర్తయినట్లుగా తెలుస్తోంది. వాస్తవానికి ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో ప్రారంభమైంది. కానీ మహేష్ బాబు తల్లిదండ్రులు ఇద్దరూ కన్ను మూయడంతో సినిమా షూటింగ్ అనేక సార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఇక ఈ సినిమాని ఆగస్టు 11వ తేదీన విడుదల చేయడానికి నిర్మాతలు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ చివరిలోపు 60 నుంచి 70 శాతం షూటింగ్ పూర్తి చేసేలా టార్గెట్ ఫిక్స్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... ఇప్పటికే 30% షూటింగ్ పూర్తయిన సరే.. ఫస్ట్ ఆఫ్ లోని మేజర్ సీన్స్ పూర్తయినట్లుగా చెబుతున్నారు. అయితే పూజా హెగ్డే కి గాయం కావడంతో ఆమె పాత్రకి సంబంధించిన షూటింగ్ పోర్షన్స్ వాయిదా పడినట్లుగా తెలుస్తోంది. ఆమె వల్ల షూటింగ్ కాస్త డిలే అయినట్లుగా చెబుతున్నారు. ఇక తాజాగా ఈ సినిమా షెడ్యూల్ ఈ ఉదయాన్నే మరోసారి ప్రారంభమైనట్లుగా తెలుస్తోంది.ఇక ఉగాది పండుగ సందర్భంగా ఈ సినిమా యూనిట్ నుంచి ఒక అప్డేట్ వచ్చే విధంగా ప్లాన్ చేసుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. సూపర్ స్టార్ కృష్ణ పుట్టిన రోజుకి టీజర్ లేదా ఫస్ట్ గ్లింప్స్ లాంటిది కూడా రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.ఇక ఈ సినిమా పూర్తి అయిన వెంటనే మహేష్ బాబు రాజమౌళి దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు ఆ సినిమా వర్క్ షాప్స్ కోసమే కేవలం రెండు నెలల పాటు మహేష్ బాబు డేట్స్ కేటాయించినట్లుగా ప్రచారం జరుగుతోంది. మునుపెన్నడూ లేనివిధంగా ఈ సినిమా రూపొందించబోతున్నట్లుగా ప్రచారం జరుగుతుంది.

## కమ్ముల సినిమా.. ధనుష్ కు పట్టు దొరికేసింది

శేఖర్ కమ్ముల డైరెక్షన్.. ధనుష్ హీరోగా తాజాగా రాబోతున్న సినిమా గురించి అందరికీ తెలిసిందే. అయితే తెలుగు తమిళ్ హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని ఏక కాలంలో తెరకెక్కించబోతున్నారు. నారాయణ్ దాస్ కె నారంగ్ ఆశీస్సులతో.. అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో కలిసి శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ పతాకంపై సునీల్ నారంగ్ పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇటీవల సార్ సినిమాతో వచ్చిన హిట్టు కొట్టిన ధనుష్.. ఈ చిత్రంతోనూ సూపర్ దూపర్ హిట్టు కొడతారని అంతా భావిస్తున్నారు. వరసు సినిమాలు చేస్తుండడంతో తెలుగులో ధనుష్ కు పట్టు దొరికేసిందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక కమ్ముల కంటెంట్ క్లిక్ అయితే తెలుగులోనే 50 నుంచి 70 కోట్ల మధ్యలో బిజినెస్ పక్కా జరుగుతుందని అంచనా వేస్తున్నారు. అందులోనూ పాన్ ఇండియా సినిమా కాబట్టి.. ధనుష్ కెరియర్ కు ఇది బెస్ట్ అవ్వచ్చని తెలుస్తోంది. ఈ సినిమా మొత్తంగా 150 కోట్ల బిజినెస్ చేసే అవకశాలు మెండుగా కనిపిస్తున్నాయి.


**FORM IV**

Statement about ownership and other Particulars about news-paper **VIBHARE TELUGU DAILY** to be Published in the first issueevery year after the last day of February 2023.

1. Place of Publication : Kurnool
2. Periodicty of its Pulication : Daily (M)
4. RNI No. : **APTEL/2019/77190**
5. Printers Name : **A. VIJAYA BHASKARA REDDY**
   Nationality : Indian
   Address : SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL-518 001 A.P.
6. Publisher Name: **A. VIJAYA BHASKARA REDDY**
   Nationality : Indian
7. Editor's Name : **A. VIJAYA BHASKARA REDDY**
   Nationality : Indian
   Address : AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. A.P
8. Names and Address and Individuals who own the news papers or Share holders holding more than one Percent of the total capital. : **A. VIJAYA BHASKARA REDDY**

I **A. VIJAYA BHASKARA REDDY** hereby declare that the Particulars given above are true to the best of my Knowledge and belief .

Date : 28.02.2023 Sd/-
Singnature of Publishers


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190